www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -200 గురువారం 23 అక్టోబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# చెక్ పోస్టులు రద్దు

## ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం

**సిఎం ఆదేశాలతో తక్షణ చర్యలు - నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు**

**సిబ్బందిని జిల్లా కార్యాలయాలకు తరలించాలని సూచన**

**బోర్డులు, బారికేడ్లు తొలగించి వీడియో తీయాలని ఆదేశం**

**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**

:తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారుమిగతా 2లో...



# నేడు క్యాబినెట్

**బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం**

**ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణపై సమాలోచనలు**



**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**

రాష్ట్ర మంత్రి వర్గం గురువారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపైనే ప్రధానంగా చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీనిపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.అలాగే ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు ప్రాజెక్టులపై మంత్రివర్గం చర్చించనుంది. అలాగే ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు రామిరెడ్డి దామోదర్‌రెడ్డి పేరుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రైతు భరోసాపై క్యాబినెట్ చర్చించనుంది. వీటితో పాటు మరిన్ని అంశాలు మంత్రి వర్గ సమావేశంలో చర్చకు రానున్నట్టు సమాచారం.



## 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..

**అమెరికాతో భారత్ డీల్..!**

**భారత ఎగుమతులపై ప్రస్తుతం 50 శాతం వసూలు చేస్తున్న అగ్రరాజ్యం**

**త్వరలో ఇరు దేశాల మధ్య కుదరనున్న ఒప్పందం..**

**అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎంట్రీ..!**

2లో.

# రెండేళ్లలో ఉస్మానియా పూర్తి

**ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు**

**ఆస్పత్రికి అసవరమైన వైద్య పరికారలు సిద్ధం చేయాలి**

**ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందుకు సాగాలి**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ఆదేశాలు**

**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**

గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం



చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్‌ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.మిగతా 2లో...


# దక్షిణ ఏపీకి రెడ్ అలర్ట్

భారీ వర్షాలతో

తమిళనాడు అతలాకుతలం..

ఇద్దరు మహిళలు మృతి

బంగాళాఖాతంలో అల్పపీడనం..



2లో.

# జూబ్లీహిల్స్ ఎన్నికపై కెసిఆర్ మంతనాలు

**మాజీ సీఎం కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ**

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ**

**ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో సమావేశం**



## అయ్యప్ప సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము

**శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం..**

**ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..**

**శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు**



2లో.

## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

**దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు : బండిసంజయ్ ఫైర్**

**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**


పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మిగతా 2లో...



## గాలి మాటలతో ఎంతకాలం మోసం

**మాటలు ఘనం..పాలన ఆచరణలో శూన్యం**

**మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**



**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు ఘనంగా ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యం అని ఆయన అన్నారు. గాలి మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య అని హరీష్ రావు పేర్కొన్నారు.మిగతా 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# దక్షిణ ఏపీకి రెడ్ అలర్ట్

అమరావతి,, **అక్టోబర్22ప్రజావినికిడి:**
తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, "వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయి" అని తెలిపారు.భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# తెలంగాణ రవాణాచెక్ పోస్టుల ఎత్తివేత

(మొదటి పేజి తరువాయి)
చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు
అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్?పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

# 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..

**అమెరికాతో భారత్ డీల్..!**

మనదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ లు తగ్గనున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న వస్తువులపై 50 శాతం పన్ను వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నందుకు ట్రంప్ 25 శాతం ప్రతీకార సుంకాలు కూడా ఉన్నాయి. అయితే, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, ఆ తర్వాత ట్రంప్ సుంకాలు 15 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలిపాయి.రష్యా నుంచి తగ్గనున్న దిగుమతులు ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించనుందని, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించనుందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తంచేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల కోసం ట్రంప్ పట్టు..
భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు కీలకంగా మారాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరపడంపైనా ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. అయితే, ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశాలపై పరస్పర అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**భారత మార్కెట్లలోకి అమెరికా మొక్కజొన్న**
రష్యా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించడంతో పాటు అమెరికా మొక్కజొన్న, సోయామీల్‌ను కూడా భారత మార్కెట్లోకి అనుమతించే అవకాశం ఉన్నట్లు సదరు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొక్కజొన్నపై 15 శాతం దిగుమతి సుంకం కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ట్రేడ్ వార్ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతులను చైనా తగ్గించుకుంది. ఈ పరిస్థితుల్లో తమ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రంప్ ప్రత్యామ్నాయంగా భారత మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు.

# రెండేళ్లలో ఉస్మానియా ఆసుపత్రి పూర్తి

(మొదటి పేజి తరువాయి)
పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అయ్యప్ప సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము



శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు.కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హెంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు.పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు.రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు %-% కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు.మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు తెలిపారు.

# బాలిక కిడ్నాప్, అత్యాచరం కేసులో 32ఏళ్ల జైలు

## నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు



నల్లగొండ,**అక్టోబర్22ప్రజావినికిడి:**
పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. మైనర్‌పై అత్యాచారం కేసులో దోషికి 32యేళ్ల జైలు శిక్ష విధించింది. శిక్షతోపాటు 75వేల రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ఇంఛార్జీ జడ్జి రోజారమణి తీర్పును వెలువరించింది. 2022 లో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగిన బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో ఈతీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే..

2022 సెప్టెంబర్ 20న నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం కు చెందిన బాలిక నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కిడ్నాప్‌నకు గురైంది. పోలీసుల విచారణలో పానగల్ కు చెందిన గురిజాలా చందు ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో చందుపై అదే రోజు నల్లగొండ టూ టౌన్ పీఎస్ లో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. దఫాలుగా కేసు విచారణ చేపట్టిన నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు.. తుది తీర్పును బుధవారం వెలువరించింది. సాక్ష్యాలు విన్న తర్వాత తుది తీర్పు వెల్లడించిన న్యాయమూర్తి రోజారమణి.. నిందితుడు చందూను దోషిగా తేల్చింది.. అతనికి 32ఏళ్ల కారాగార శిక్ష విధించింది. 75వేల రూపాయల జరిమానా తోపాటు బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. ఐవోలుగా ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి,డి. చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత ఎస్.హెచ్.ఓ సైదులు, సి.ఐ రాఘవరావు వ్యవహరించారు. లైసెన్ ఆఫీసర్ మల్లికార్జున్, నరేంధర్,సి.డి.ఓ సుమన్, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన ఉన్నారు.

# గాలి మాటలతో ఎంతకాలం మోసం

చిన్న ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం సర్కార్‌కు ఎందుకు సాధ్యం కాకపోతుందో విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్లు వేతనాల కోసం నెలలుగా ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని హరీష్ రావు తెలిపారు. ఈ పరిస్థితి ద్వారా ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులు మానసికంగా హానికరంగా ఎదురవుతున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉన్నదని ఆయన విమర్శించారు. 'కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం నిలిపివేయబడింది. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా, అమలు గాలికి వదిలివేశారు. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా?' అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో గాలి మాటలకు గురి చేస్తే ఉద్యోగులను మోసం చేయడం అనైతికమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చెలించిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు కూడా తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి ఆహ్వానించారు. ఈ పరిస్థితి ద్వారా సర్కార్ సొంత మాటల మాయాజాలంలో మిగిలిపోకుండా, ఉద్యోగుల హక్కులను గౌరవించాల్సిన అవసరం ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

# బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడించారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నారంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని నల్లకుంట శంకర్‌మఠ్‌కు చేరుకున్న బండి సంజయ్.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రు ంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులను కేంద్రమంత్రి అందుకున్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికపై కెసిఆర్ మంతనాలు

**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రోడ్ షోలు, ప్రచార వ్యూహాలపై, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం.. జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఎలా చేస్తున్నారు.. ఓటర్ల నాడీ ఎలా ఉంది అని కేసీఆర్ ఆరా తీసినట్టు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ ప్రచారం, 40 మంది బీఆర్ఎస్ స్టార్ కంపైనర్ల ప్రచార తీరుపై చర్చ సాగినట్టు తెలిసింది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తెలియజేయాలని బీఆర్ఎస్ నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నట్టు సమాచారం. దీనికితోడు జూబ్లీహిల్స్ ఇన్‌చార్జిలతో ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కేసీఆర్ పాల్గొంటారన్న చర్చ కూడా జరుగుతోంది.

# ఖైరతాబాద్ లో సదర్ ఉత్సవాలు పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని..



**ప్రజావినికిడి, (ఖైరతాబాద్):**,నిజాయితీ కి మారుపేరు యాదవులు అని మాజీమంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం రాత్రి ఖైరతాబాద్ లో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి పండుగ మరుసటి రోజు నిర్వహించే సదర్ ఉత్సవాలు నేడు హైదరాబాద్ మహా నగరంలోనే కాకుండా జిల్లాలలో కూడా జరుపుకోవడం ఎంతో సంతోషదాయకం అన్నారు. ఈ సదర్ యాదవుల ఐక్యతకు చిహ్నం అని పేర్కొన్నారు.

# షేక్ పేట్ లో కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర..

**పాల్గొన్న డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ..-అనూహ్య స్పందన..**



**ప్రజావినికిడి,(షేక్పేట్):** షేక్ పెట్ డివిజన్ లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పాదయాత్రకు ప్రజల నుంచి సంపూర్ణమైన మద్దతు లభించింది.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వి నవీన్ యాదవ్ కు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ఓటర్లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ నాయకత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ కు షేక్పేట్ డివిజన్ లో ఓటు వేసి గెలిపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రీతి, జ్యోతి,సోనీ,స్వరూప, రమేష్,నర్సింగరావు, బాలు,రఘు,లడ్డు, సతీష్,శేఖర్,ముజీబ్, ఒమర్,మక్బూల్, విగ్నేష్,సంతోష్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో సునీతమ్మ గెలుపు ఖాయం..


**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి..**

**ఎల్లారెడ్డి గూడలో మాజీ ఎమ్మెల్యే విష్ణు వర్ధన్ రెడ్డి ప్రచారం..**

**పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి..**




**ప్రజావినికిడి,(హైదరాబాద్):**కేసీఆర్ హైదరాబాద్ నగర అభివృద్ధిలో తెచ్చిన మార్పును ప్రపంచమే గుర్తిచ్చిందని,కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి జూబ్లీహిల్స్ ప్రజలు మాగంటి సునీతమ్మను గెలిపించాలని సోమాజిగూడ డివిజన్లో ఎల్లారెడ్డిగూడలో పోలింగ్ భూత్ లలో మాగంటి సునీతమ్మ గెలుపు కొరకు మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మా రెడ్డి,కార్పొరేటర్స్ మాజీ కార్పొరేటర్లు,హేమ షామల,మహేష్ యాదవ్,శైజాన్ శేఖర్,దేవేందర్ రెడ్డి, ప్రభు దాస్ భూత్ ఇన్చార్జులు కోఆర్డినేటర్లు స్థానిక నాయకులుతదితరులు పాల్గొన్నారు.



# సదర్ సమ్మేళనంలో పాల్గొన్న మధుయాష్కిగౌడ్..





**ప్రజావినికిడి,(హయత్ నగర్):**
హయత్ నగర్ లో జరిగిన యాదవ సదర్ సమ్మేళనం ఉత్సవాలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా పశు సంపదను ప్రదర్శిస్తూ.. యాదవ సోదరులు సదర్ నిర్వహించడం ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తుందని ఈ సాంప్రదాయాన్ని ఇలాగే కొనసాగించాలని మధుయాష్కీ పేర్కొన్నారు.హయత్ నగర్ లో చేపట్టనున్న శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి అన్ని విధాలుగా తన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్,డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్,గజ్జి శ్రీనివాస్ యాదవ్,నక్క ఉమేష్ యాదవ్,నక్క శ్రీనివాస్ యాదవ్,గజ్జి మహేష్ యాదవ్,ఉగాది బాలు,ఉగాది శివ, తాటిచెట్టు శ్రీకాంత్ గౌడ్,ప్రకాష్, మనోజ్,మాడుగుల చరణ్ గౌడ్,మాడుగుల నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లోటస్ పబ్లిక్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మంజుల రెడ్డి ఆకస్మిక మృతి...

**మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పలువురి పరామర్శ...**







**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
లోటస్ పబ్లిక్ స్కూల్స్ అధినేత డాక్టర్కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి సతీమణి లోటస్ పబ్లిక్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ అలాగే ప్రభుత్వ లెక్చరర్ అటువంటిశ్రీమతి కోమటిరెడ్డి మంజులారెడ్డి ఆకస్మిక దిగ్భ్రాంతికర మృతి చెందిన వార్త విస్మయానికి గురిచేసింది.విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చింతలకుంట పివిటి మార్కెట్ సమీపంలోని కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నివాసంలో శ్రీమతి కోమటిరెడ్డి మంజులారెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దివంగత మంజులా రెడ్డికి నివాళులర్పించిన వారిలో ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఆర్ఎస్పి పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ తదితర ప్రముఖులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.ఇది ఇలా ఉండగా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి శ్రీమతి మంజులా రెడ్డి ఆకస్మిక మృతి వార్తను తెలుసుకున్న బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు,వివిధ పార్టీల నేతలు, వందలాదిగా తరలివచ్చి ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. అనంతరం ఎల్బీనగర్లోని సిల్క్ టవర్ (పివిటి మార్కెట్ పక్కన)
నుండి కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నివాసం నుంచి మంజులా రెడ్డి అంతిమయాత్ర ప్రారంభమై
తదనంతరం నాగోల్ బ్రిడ్జి పక్కన ఉన్న హిందూ స్మశానవాటికలో మధ్యాహ్నం మూడు గంటలకు దహన సంస్కారాలు ముగిశాయి.

# పట్టణ ప్రాంత పేదలకు శుభవార్త

**జి ప్లస్ 1 తరహాలో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశం..**

**మారనున్న మురికి వాడల రూపురేఖలు..**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో శర వేగంగా సాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల పై బుధవారం నాడు మంత్రి సచివాలయం లోని తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామని అన్నారు.

కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్1తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు.గ్రౌండ్ ఫ్లోర్లో 200 చదరపు అడుగులు మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేలా ఈ మేరకు జీవో ఎంస్ నె 69 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరత ను దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చామని తెలిపారు.పట్టణ ప్రాంతాల్లోని పేదలకు పక్కా ఇంటి వసతి కోసం కొద్ది కాలంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధ్యయనం చేశామని తెలిపారు.



రాష్ట్రంలోని అనేక పట్టణాలు,నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకోడానికి తగిన స్థలం లేక,అరకొర వసతులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అటువంటి వారి కోసం ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

అనేక మంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకుల షెడ్లు,ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారు.వీరికి ఆర్ సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదు.ఈ సమస్యను అధిగమించడానికి పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతినిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశల వారీగా నిర్మాణపు పనుల స్థాయిని బట్టి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

**పట్టణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణం ఎలా ఉండాలంటే..**

జిం1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో ,70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతోపాటు,కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలి,ప్రతి ఇంటికి ప్రత్యేకంగా టాయిలెట్,బాత్ రూంలు తప్పనిసరిగా ఉండాలని,
ఈ ఇంటి నిర్మాణం ఆర్ సిసి స్లాబ్ తో ఉండాలని,ఇందుకు సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్లకు డిఇఇ (హౌసింగ్)అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లింపు...**

మొదటి అంతస్తు %-% రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయితే రూ. 1 లక్ష,అటు తరువాత గ్రౌండ్ ఫ్లోర్ రూఫ్ వేసిన తరువాత రూ.1లక్ష, ఆపైన ఫస్ట్ ఫ్లోర్ లో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తి అయిన పిదప రూ.2 లక్షలను,ఇంటి నిర్మాణపు పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలను విడుదల చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక ఎత్తు అయితే,పట్టణ ప్రాంతాల్లో మరో ఎత్తు అని, ఇది ప్రభుత్వానికి ఒక సవాల్ అని దీనిని దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ తనిఖీలు..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** ఎలికట్ట చౌరస్తాలో సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై చర్యలు చేపట్టారు. లైసెన్స్,రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్,హెల్మెట్ వంటి అంశాలను సవివరంగా తనిఖీ చేశారు.ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.అలాగే, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని,హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి తప్పిదాలకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శివ నేత

**ప్రజావినికిడి, (హైద్రాబాద్):**
ప్రజల భవిష్యత్తే ధ్యేయంగా హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా కనుమరుగైన చెరువులకు జీవం పోస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ నీ కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శివ నేత హైడ్రా కమిషనర్ రంగనాథ్ పుట్టినరోజుని తెలంగాణ ప్రజలు, డిఆర్ఎస్ అదేవిధంగా హైడ్రా బృందలు పండగల జరుపుకుంటున్నాయని
శివ నేత తెలియజేశారు.




# చర్లపల్లి-దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు




**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:** పండగల సందర్భంలో చర్లపల్లి-దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 23, 28తేదీల్లో చర్లపల్లి- దనపూర్(07049)రైళ్లు, 24,29 తేదీల్లో దనపూర్-చర్లపల్లి (07092) రైళ్లు, 26న చర్లపల్లి- దనపూర్ (07049), 27న దనపూర్-చర్లపల్లి (07050)ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు అధికారులు వివరించారు. ఈ ప్రత్యేక రైళ్లు వచ్చి వెళ్లేప్పుడు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్ని, మైహర్, సత్నా, ప్రయాగ్‌రాజ్ చౌకి, పండిట్. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అరా స్టేషన్‌లలో ఆగుతాయని పేర్కొన్నారు.

.................................................................

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఎవరూ ఆపలేరు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**యూసుఫ్ గూడా డివిజన్ 56వ బూత్ ఇన్చార్జిగా ఎమ్మెల్యే శంకర్ నియామకం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కలిసి డివిజన్లో పర్యటన,కీలక సమావేశం**

**విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పర్యటించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు అనివార్యమని అన్ని విధాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ గెలుపు తధ్యమని నవీన్ యాదవ్ గెలుపు ఎవరు ఆపలేరనీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా డివిజన్ 56వ బూత్ ఇన్చార్జిగా నియమించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ప్రాంత కాంగ్రెస్ నాయకులతో కీలక సమావేశాన్ని నిర్వహించి బూత్ పరిధిలో ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ,
స్థానిక ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు జూబ్లీహిల్స్ కు అవసరమని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ ను నిర్లక్ష్యం చేసిందని, తమ ప్రభుత్వం మాత్రం నెలల వ్యవధిలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం సుమారు రూ. 140 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు.గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా.. ఉన్న రేషన్ కార్డులను తొలగించి పేద ప్రజల కడుపు కొట్టింది. ప్రజా ప్రభుత్వం మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేసి కడుపునిండా అన్నం తినేందుకు సన్న బియ్యాన్ని అందిస్తున్నదనీ
మరోవైపు ఉచితంగా 200 యూనిట్లు కరెంటు,మహిళలకు ఫ్రీ బస్సు,ఇందిరమ్మ ఇండ్లు,వంట గ్యాస్ సబ్సిడీ వంటి అనేక
క్షేమ పథకాలను అందజేస్తున్నది అని ఆయన వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు అత్యధిక మెజారిటీ అందించాల్సిన బాధ్యత ఇక్కడి ప్రతి కార్యకర్త,ప్రతి నాయకుడి మీద ఉందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల సమస్యలను వినేందుకు కూడా సమయం ఇచ్చేది కాదని,తమ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజా ప్రభుత్వమని.. కష్టాలను,నష్టాలను



చెప్పుకునే పేదలకు అవకాశం ఇస్తున్నదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కావలి కృష్ణ రాయికల్ శ్రీనివాస్,తుపాకుల శేఖర్ లింగారెడ్డిగూడెం అశోక్,సీతారాం కేకే కృష్ణ గంగమోని సత్తయ్య ఆవుల శివ, శ్రీహరి,కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు స్వర్గధామం

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మో డల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను ఐటి, పరిశ్రమల శాఖ మం త్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భా గంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాం ధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భే టీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కా ర్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్




ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహాకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయమన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఒరికా సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# తాగిన మైకంలో తండ్రిని కడతేర్చిన కొడుకు



**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:** తాగిన మైకంలో కన్నతండ్రిని అతిదారుణంగా హత్య చేసిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్.. తన కుమారుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి మద్యం సేవించారు. అనంతరం ఆ మద్యం మత్తులో తండ్రి కొడుకుల మధ్య మాటమాట పెరిగింది. దీంతో వారిద్దరు ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న బండరాయి తీసుకుని.. కన్నతండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి నిజాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక నిజాముద్దీన్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు.. ఆసుపత్రికి చేరుకున్నారు.

# మూసీని ఆదిత్య ఆక్రమించింది!..

## గండిపేట్ తహాశీల్దార్‌కు హైడ్రా లేఖ

**హైదరాబాద్, అక్టోబర్22ప్రజావినికిడి:**
మూసీ సదిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తుంది. ప్రకృతిపరంగా ప్రవహిస్తున్న నదిలో ఆక్రమణలు చేపట్టడంపై హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఉపేక్షించేది లేదంటూనే మూసీని ఆక్రమించినట్టుగా వచ్చిన ఆరోపణలపై ఆయన స్పందించారు. ఈమేరకు గండిపేట్ మండల తహాశీల్దార్‌కు ఈ నెల 22నసరిహద్దులను ఫిక్స్ చేయాల్సిందిగా లేఖ రాశారు. ఆ లేఖలో మంచిరేవుల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 476 సరహద్దులతో పాటు ఔటర్ రింగ్ రోడ్ సరిహద్దును నిర్ధారించాలని సూచించారు. ఈ క్రమంలోనే శ్రీఆదిత్య నిర్మాణంపై స్థానిక ప్రజలతో పాటు ప్రజాప్రతినిధుల నుండి కూడా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఆ సంస్థ చేపడుతున్న నిర్మాణ స్థలాన్ని, అక్కడ నది వెడల్పును, ఔటర్ రింగ్ రోడ్ బౌండరీని కూడా నిర్ధారించాలని కమిషనర్ రంగనాథ్ ఆలేఖలో సూచించారు. హైడ్రా పరిశీలనలో మంచిరేవుల గ్రామం సర్వే నెం. 476లో నాలా ఆక్రమణలు జరిగినట్టు, నదిని



పూడ్చినట్టు, ఓఆర్ఆర్ ప్రాజెక్టులో పోయిన భూమిని నది తీరాన్ని కబ్జా చేయడం ద్వారా లబ్ధిపొందినట్టు గుర్తించినట్టు హైడ్రా భావించినట్టు లేఖలో పేర్కొన్నది. నాలా నిర్మించకుండానే.. నిర్మాణాలు.. డేమ్(డీఈఎం) వివరాల ప్రకారం.. శ్రీఆదిత్య కేడియా రియల్టర్ సంస్థ చేపట్టిన భవన నిర్మాణం మూసీ నది పాయలు కలిపే 0.37 ఎకరాల వాగును ఆక్రమించినట్టుగా తెలుస్తుంది. ఈ ప్రదేశంలో నదిని వెడల్పును 23 మీటర్లు. నది బఫర్ జోన్ కూడా భవన నిర్మాణం ద్వారా 0.48 ఎకరాల విస్తీర్ణంలో ఆక్రమించినట్టుగా వెల్లడవుతోంది. నాలా (వాగు) సగటు వెడల్పు 16 మీ.లు ముస్కిన్ చెరువు/నాగిరెడ్డి కుంట నుండి ఈ నాలా వస్తూ కోకాపేట, నార్సింగి పరివాహక ప్రాంతం మీదుగా మూసీకి వస్తోంది. బిల్డర్లు ప్రస్తుతమున్న నాలాను మళ్లించాలనుకుంటే.. వారు నీటిపారుదల శాఖ మార్గదర్శకాల ప్రకారం బిల్డర్ తన సొంత ఖర్చులతో భూమిని తీసుకుని కొత్త నాలాను ఏర్పాటు చేయాలి. నీటిపారుదల అధికారులు 08-10-2021న బిల్డర్‌కు జారీ చేసిన ఎన్ఓసి ప్రకారం ఓఆర్ఆర్ ఈ నాలాను ఏర్పాటు చేసిన అనంతరమే నిర్మాణాలు చేపట్టాలని స్పష్టంచేయడం జరిగింది. కానీ, శ్రీఆదిత్య కేడియా రియల్టర్లు అన్ని షరతులను ఉల్లంఘించి, కొత్త వరద నీటి కాలువను పూర్తి చేయకుండానే ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. 16 మీటర్ల వెడల్పున్న నాలాను మూసివేయడం వల్ల ఇటీవలి వర్షాలలో కోకాపేట, నార్సింగి ప్రాంతాలలో వరదలు సంభవించాయి. అని లేఖలో కమిషనర్ రంగనాథ్ లేవనెత్తారు.

# రేషన్ బియ్యం సంచులకు కన్నం

## సామాజిక మధ్యమాల్లో వైరల్



**అనంతగిరి: అక్టోబర్22ప్రజావినికిడి:** రేషన్ దుకాణాలకు సరఫరా చేసే సన్న బియ్యం సంచలకు కన్నాలు వేసి కాజేస్తున్న తీరుపై తీసిన వీడియో ఒకటి చెక్కర్లు కొడుతోంది. ప్రతినెల చౌక ధర దుకాణాలకు డీలర్లు ఇచ్చే స్టాక్ పాయింట్ల గోదాములు నుంచి లారీల్లో బియ్యం సంచులు తీసుకెళ్లి ఆన్ లోడ్ చేస్తారు. జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి అక్టోబర్ కోట లారీలో తీసుకెళ్లాల్సి ఉండగా అమాలీలు సంచులకు కన్నాలు వేసి బియ్యం ఇతర సంచుల్లోకి మారుస్తుండగా ఒక వ్యక్తి వీడియో తీసి సామాజిక మధ్యమ%శీ%లో పోస్టు చేయడంతో అది కాస్త వైరలై%శీ%ది. కంచె చేను మేస్తే అన్న చందంగా రేషన్ దుకాణాలకు సన్న బియ్యం చేరవేయాల్సిన వారే దోపిడీకి పాల్పడడం విచిత్రం. డీలర్లు ఈ కోటాను లబ్ధిదారులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. వీరికి కింటాకు రూ. 1.50 ప్రభుత్వం కమిషన్ చెల్లిస్తుంది. అయితే కొన్నాళ్లుగా రేషన్ దుకాణాలకు స్టాక్ పాయింట్ల నుంచి సంచుల్లో తరుగు ఉంటోందని డీలర్లు వాపోతున్నారు. ప్రస్తుతం వ్యవహారం గమనిస్తే ఈ తరుగుకు కారణం అమలీల దోపిడేనని అర్థమవుతోంది. వ్యవహారంపై జిల్లా పౌర సరఫరాల శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# టపాసులు మిగిలాయా జర భద్రం.



హైదరాబాద్**అక్టోబర్22ప్రజావినికిడి:** దీపావళి వేళ టన్నుల కొద్ది టపాసులను దిగుమతి చేసుకున్న వ్యాపారులు పండగ పూర్తయిన తర్వాత మిగిలిన సరుకును ఇళ్లలో జనవాసాలున్న గోదాముల్లో భద్రపరుస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం చిన్న నిప్పురవ్వ పడిన జరిగే నష్టాన్ని ఊహించలేము నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఇలా చేయండి:**

ఇళ్ల లో భద్రపరచకూడదు జన వాసాలకు దూరంగా ఉన్న గోదాముల్లో ఉంచాలి షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి వారంలో మూడు రోజులు తనిఖీలు చేయాలి గాలి వెలుతురు ఉండే ప్రాంతాల్లో భద్రపరచొద్దు ప్రమాదాలు నిలవరించేందుకు డ్రై కెమికల్ సిలిండర్లు ఏర్పాటు చేయాలి పేలుడు స్వభావం పెట్రోల్ డీజిల్ ఇతర ద్రవాలు ఎల్పిజి సిలిండర్లను దరిదాపుల్లో ఉంచకూడదు టపాసుల మధ్య శాండ్ బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి వాటర్ ట్యాంకు అందుబాటులో ఏర్పాటు చేసుకోవాలి.

## వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన తహసిల్దార్'హిమబిందు



హైదరాబాద్**అక్టోబర్22ప్రజావినికిడి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి మండల తహసిల్దార్ హిమ బిందు అన్నారు. మండలంలోని పాలవరం, త్రిపురవరం, అమీనాబాద్, కొత్త గోల్ తండా, అనంతగిరి, శాంతినగర్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తాసీల్దార్ హిమబిందు అన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధన ప్రకారం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరి సింగ్ ఏపీఎం సౌజన్య, సీసీ రామకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, చుండూరు వెంకటేశ్వరరావు, గునుగుల గోపాల్ రెడ్డి, బానోతు బాబు నాయక్, డేగ కొండయ్య, ఆయా గ్రామాల నాయకులు ఐకెపి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరంగానే ఇవ్వాలి.. పార్టీలపరంగా వద్దే వద్దు: అర్.కృష్ణయ్య



హైదరాబాద్**అక్టోబర్22ప్రజావినికిడి:** బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టపరంగానే ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఇచ్చే కోటాతో బడుగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. గురువారం జరిగే కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన స్పష్టత ఇవ్వాలని కోరారు. పార్టీ పరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఆలోచనలు ప్రభుత్వం చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందని చెప్పిన ఆయన ఈ తరహా వాటాతో బలహీన వర్గాలకు సరైన న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. ఎవరి భిక్షం వద్దని, చట్టబద్ధంగానే బిసిల జనాభా ఎంతో అంతా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశం కోర్టులో పరిధిలో ఉందని, మరో రెండు నెలల్లో తీర్పు రానుండగా తొందరపాటు నిర్ణయాలు ఎందుకని ప్రశ్నించారు. బిసి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన జరిగిన రాష్ట్ర బంద్ చారిత్రాత్మకమని, అన్ని పార్టీలు, అన్నివర్గాలు బంద్‌కు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. బిసిల డిమాండ్ న్యాయమైనదని, బంద్ తీవ్రతను పాలకులు గుర్తించాలన్నారు. స్థానిక సంస్థలలో బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధమైన చట్టబద్ధత, న్యాయబద్ధత ఉందని అన్నారు. ఆర్టికల్ 243- డి-6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. జనాభా లెక్కలు తీసి అసెంబ్లీలో చట్టం చేసినందున, వాస్తవాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేయాలని సూచించారు. గతంలోనూ సుప్రీంకోర్టు అనేక తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే రిజర్వేషన్లు పెంచవచ్చని చెప్పినందున 42 శాతం చట్టబద్ధ రిజర్వేషన్ల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# రవాణాశాఖలో ఏఐ సాంకేతికత అమలు

**షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్ల పరిశీలన**

**ఢిల్లీ కాలుష్యం దృష్ట్యా హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్**




హైదరాబాద్**అక్టోబర్22ప్రజావినికిడి:** ఢిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందని మంత్రి పొన్నం అన్నారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చెక్‌పోస్టులను తక్షణమే మూసివేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీఏ చెక్ పోస్టుల రద్దు చాలా పెద్ద నిర్ణయమని పేర్కొన్నారు. చెక్ పోస్టుల విషయంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని.. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న ఆర్టీఏ చెక్ పోస్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో సిమ్యులేటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రవాణా వ్యవస్థలో ఏఐ సేవలు మరింత వినియోగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం రవాణా శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ఏ విధంగా ఉందో అందరం చూస్తున్నామని.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని.. రూల్స్ అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు ఇస్తున్నామని.. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల స్క్రాపింగ్ విషయంలో కొత్త పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వాహనాల స్క్రాపింగ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు.

------

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

**అబద్ధాలతో దబాయించడం చంద్రబాబుకు అలవాటు -పోస్టర్ రిలీజ్ చేసిన వైకాపా నేత సజ్జల తదితరులు**




అమరావతి **అక్టోబర్22ప్రజావినికిడి:** ఏపీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ధర్నాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ హయాంలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయి. అబద్దాలు చెప్పి దబాయించడం చంద్రబాబు అలవాటే. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకిస్తున్నారు. వైఎస్ జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారు. కోవిడ్ తర్వాత ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయి. కూటమి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గ చర్య. దీనిపై ప్రజల్లో కూడా వ్యతిరేకత బాగా పెరిగింది. ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకు పోరాటం చేస్తాం. ఇది రాజకీయాల కోసం కాదు, రాష్ట్ర భవిష్యత్తు కోసమే. ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిరసన ర్యాలీలు చేస్తాం. ప్రజాస్వామ్య వాదులంతా హాజరు కావాలని కోరుకుంటున్నాం. ఇప్పటికే కోటి సంతకాల సేకరణ ఉధృతంగా జరుగుతోంది. ప్రజల అభిప్రాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం. స్వచ్ఛందంగా ప్రజా సంఘాలు, మేధావులు ఈ పోరాటంలో పాల్గొంటున్నారు. అందులో భాగంగానే ఈనెల 28న అసెంబ్లీ నియోజకవర్గాలలో ర్యాలీలు చేయబోతున్నాం. తర్వాత నవంబర్ 12న జిల్లా కేంద్రాలలో కూడా ర్యాలీలు చేస్తాం. కోటి సంతకాలు పూర్తి చేసుకుని వాటిని నవంబర్ 23న జిల్లాలకు తరలిస్తాం. అనంతరం కేంద్ర కార్యాలయానికి వస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణను ఆపాలి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం, వైద్య విద్యను అందించాలన్నది వైఎస్ జగన్ ఉద్దేశం. అందుకే 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతాయి. ఒక్కరోజులో ఏ కాలేజీ పూర్తి కాదు. ఎయిమ్స్ లాంటి సంస్థ పూర్తవటానికే తొమ్మిదేళ్లు పట్టింది. పులివెందుల కాలేజీ పూర్తయినా చంద్రబాబు సీట్లు రాకుండా అడ్డుకున్నారు. పాడేరు కాలేజీకి 50 సీట్లు చాలని మిగతావి రాకుండా అడ్డుకున్నారు. సంవత్సరానికి వెయ్యి కోట్లు చొప్పున నాలుగైదేళ్లు ఖర్చు చేస్తే కాలేజీలన్నీ అందుబాటులోకి వస్తాయి. పీపీపీ అంటే ప్రయివేటీకరణ కాదని చంద్రబాబు కొత్త భాష్యం చెప్తున్నారు. లాభాల కోసమే ప్రైవేటు వ్యక్తులు మెడికల్ కాలేజీలతో వ్యాపారం చేస్తారు. ఇప్పటికే ఎవరెవరికి ఏ కాలేజీని దోచి పెట్టాలో నిర్ణయం తీసుకున్నారు. ఇక పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇలాంటి విధ్వంసాన్ని ఏపీలో ఎప్పుడూ చూడలేదు. కానీ, తన మీడియా పవర్‌తో ఎదుటి వారిపై విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

# యూఏఈలో సీఎం చంద్రబాబు..

# పెట్టుబడులే లక్ష్యంగా తొలిరోజు భేటీలు






అమరావతి,**అక్టోబర్22ప్రజావినికిడి:** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు తన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా తొలిరోజైన బుధవారం ఆయన దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలు, భారత రాయబార కార్యాలయ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను వారికి వివరించి, ఏపీకి రావాల్సిందిగా ఆహ్వానించనున్నారు. తొలిరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, అబుదాబీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, పోర్టులు, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను ఆయన వారికి వివరించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయనుందన్న విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి ఉన్న 1054 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా తమ ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేస్తోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. యూఏఈలోని వివిధ సావరిన్ ఫండ్స్ నుంచి ఏపీకి పెట్టుబడులను ఆకర్షించే అంశంపై కూడా ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించారు. ఇదే సమయంలో, యూఏఈలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు ఎంబసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. "ప్రధాని మోదీ కృషితోనే భారత్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఆయన ప్రపంచవ్యాప్తంగా భారతదేశ బ్రాండ్‌ను ప్రచారం చేస్తున్నారు. ఆయన వల్లే భారత్-యూఏఈ మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు బలపడ్డాయి" అని చంద్రబాబు అన్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# ఏపీ అందుతున్న కేంద్ర సాయం

## లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు -బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్

అమరావతి, **అక్టోబర్22ప్రజావినికిడి:** ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల్ ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడించారు మాధవ్. ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా కోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి



చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో యువత ప్రతిభకు చైనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు. ఐదేళ్లల్లో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయని ప్రకటించారు. నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. వైజాగ్ - చెన్నై కారిడార్, బెంగుళూరు - చెన్నై కారిడార్, రాయలసీమ వైపు మరో కారిడార్‌లు రాబోతున్నాయని మాధవ్ అన్నారు. డిపెన్స్ క్రస్టల్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ అన్ని ప్రాంతాలకు పెరగడం ద్వారా అభివృద్ధి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ వెహికల్ తయారు చేసే కంపెనీలు, జిందాల్ సంస్థలు, పవర్ హౌస్‌లు ఏపీకి రాబోతున్నాయని.. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాయలసీమ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మన రాజధాని అమరావతిలో గత ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని... అమరావతితో వారంతా ఆటలాడుకుని నాశనం చేశారని మండిపడ్డారు. మోడీ సారథ్యంలో ఇప్పుడు అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయించారన్నారు. అమరావతి నుంచి అనంతపురం వరకు జాతీయ రహదారుల అనుసంధానం కాబోతున్నాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం నిర్మాణం కోసం కేంద్రం ఐదు వేల కోట్లు కేటాయించిందని అన్నారు. కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్టు పూర్తి చేస్తారని వెల్లడించారు. ఏపీని అన్ని విభాగాల్లో అబివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగులు వేస్తున్నాయన్నారు. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో.. ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశ ఆర్థికాభివృద్ధికి దేశ ప్రజలంతా సహకారం అందించాలని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కోరారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో స్పీడ్ పెంచిన ఈడీ

హైదరాబాద్,**అక్టోబర్22ప్రజావినికిడి:**
రాష్ట్రంలో ఒక్కసారిగా సంచలనం రేకెత్తించిన సృష్టి ఫెర్టిలిటీ కేసుల్లో ఈడీ అధికారులు స్పీడ్ పెంచారు. ఇప్పటికే చంచల్‌గూడ మహిళా జైల్లో రిమాండ్‌లో ఉన్న నిందితులు డాక్టర్ నమ్రత, కల్యాణి, సంతోష్, నందినిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. అలాగేఈ కేసులో ప్రధాన నిందితుడు డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణను సైతం ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. గతంలో సృష్టి ఫెర్టిలిటీకి సంబంధించిన వ్యవహారంలో మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సికింద్రాబాద్ నార్త్ జోన్‌లోని గోపాలపురం పోలీసులను ఆశ్రయించి.. సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి వైద్యురాలి డాక్టర్ నమత్రపై




ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి రూ. 20 నుంచి 40 లక్షల వరకు నగదును డాక్టర్ నమత్రా వసూలు చేసినట్లు గుర్తించారు. ఇక అబార్షన్ కోసం వచ్చే మహిళలకు నగదు ఆశ చూపి.. వారి వద్ద నుంచి సైతం పిల్లలను కొనుగోలు చేసినట్లు సమాచారం. మొత్తం 86 మంది పిల్లలను విక్రయించడం ద్వారా.. రూ. 50 కోట్ల నగదు డాక్టర్ నమత్రా సంపాదించినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం నగదును హవాలా రూపంలో సేకరించింది. వీటితో భారీగా ఆస్తులు కొనుగోలు చేయడమే కాకుండా.. విదేశాలకు సైతం పెద్ద ఎత్తున హవాలా రూపంలో నగదు పంపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.ఆ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు వ్యవహారం బహిర్గమైంది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సోదాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఐదు చోట్ల, విజయవాడ, విశాఖపట్నంలో రెండు చోట్ల సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు బ్యాంక్ అకౌంట్లతో పాటు సృష్టి రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు లేని జంటలను లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమత్రా వ్యవహారాలు నడిపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

# అర మార్కు తక్కువొచ్చినా పాసే!

**ఏపీ ఇంటర్ విద్యార్థులకు గుడ్ న్యూస్..**

**ఇంటర్ సైన్స్ విద్యార్థులకు పాస్ మార్కుల్లో అర మార్కు సడలింపు**

**అక్టోబర్22ప్రజావినికిడి:**
ఏపీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యా మండలి శుభవార్త అందించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో పరీక్షా విధానంలో పలు కీలక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షల్లో అర మార్కు సడలింపు ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విద్యార్థులు అర మార్కు తేడాతో ఫెయిల్ అయ్యే ఆందోళన తొలగిపోనుంది.

**పాస్ మార్కుల్లో కొత్త విధానం ఇదే..**

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ వంటి సబ్జెక్టులకు ఈ మార్పు వర్తిస్తుంది. గతంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రాత పరీక్షల్లో కలిపి ఉత్తీర్ణత సాధించాలంటే కనీసం 59.50 మార్కులు అవసరం




కాగా, ఇప్పుడు దాన్ని 59 మార్కులకు తగ్గించారు. అంటే, అర మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులను పాసైనట్లుగానే పరిగణిస్తారు. ఈ అర మార్కును సెకండ్ ఇయర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో సర్దుబాటు చేయనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. దీని ప్రకారం ప్రాక్టికల్స్‌లో పాస్ మార్కును 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు.

**పరీక్షా విధానంలో మరిన్ని సంస్కరణలు**

ఈ సంస్కరణల్లో భాగంగా మొదటి సంవత్సరం పరీక్షల్లో కొత్తగా ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. అయితే, ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఉండదని స్పష్టం చేశారు. అలాగే, ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న వృక్షశాస్త్రం (బోటనీ), జంతుశాస్త్రం (జువాలజీ) పేపర్లను కలిపి ఒకే జీవశాస్త్రం (బయోలజీ) పేపర్‌గా మార్చారు. ఈ పరీక్షలో వృక్షశాస్త్రం నుంచి 43, జంతుశాస్త్రం నుంచి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

ఇదిలా ఉండగా, కొన్ని పాత నిబంధనలను యథాతథంగా కొనసాగిస్తున్నారు. ఏదైనా ఒక సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించి, మిగతా సబ్జెక్టుల్లో 30 శాతం మార్కులు తెచ్చుకున్నా ఉత్తీర్ణులుగా పరిగణించే విధానం కొనసాగుతుంది. ఇక, జాగ్రఫీ సబ్జెక్టు సిలబస్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని, పాత విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తామని బోర్డు తెలియజేసింది. అదనంగా గ్రూపులో ఆరో సబ్జెక్టుగా ఎంచుకున్న సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి కాదని, దానికి ప్రత్యేక మెమో జారీ చేస్తామని పేర్కొంది.

# రూపాయి బలోపేతానికి ఆర్‌బీఐ చర్యలు

న్యూఢిల్లీ,**అక్టోబర్22ప్రజావినికిడి:**
అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది.దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వాయుగుండంపై ఏపీ సర్కారు అలర్ట్



అమరావతి, **అక్టోబర్22ప్రజావినికిడి:** బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు.

# శ్రీలంలో మున్సిపల్ చైర్మన్ కాల్చివేత

## ప్రజాసమస్యలు తెలుకుంటుండగా దుండగుల కాల్పులు

కొలంబో,**అక్టోబర్22ప్రజావినికిడి:**
శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు.వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలురౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని.. దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది. వెలిగామా కౌన్సిల్ నియంత్రణపై ప్రతిపక్ష సామాగి జన బలవేగయ (÷ూఏః) పార్టీకి అధికార పార్టీ 'నేషనల్ పీపుల్స్ పవర్' పార్టీకి మధ్య తీవ్ర పోరు ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ ఛైర్మన్ హత్యకు గురికావడం అక్కడి రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఎన్ఐఏ కస్టడీకి అబూబకర్ భార్య సైరాబాను

కడప, **అక్టోబర్22ప్రజావినికిడి:** కడప సెంట్రల్ జైలుకు వచ్చిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు.. రాయచోటిలో ఇటీవల అరెస్ట్ అయిన ఉగ్రవాది అబూబకర్ సిద్ధికి భార్య సైరా భానును కస్టడీకి తీసుకున్నారు. జులై 1న రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు.. అబూబకర్ సిద్ధికి, మహమ్మద్ అలీని తమిళనాడు ఐబీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ ఇద్దరు ఉగ్రవాదుల భార్యలనూ అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి కడప జైలుకు తరలించారు. ప్రస్తుతం ఉగ్రవాది అబూబకర్ సిద్ధికి భార్య సైరాబాను, మహమ్మద్ అలీ భార్య షమీం కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అయితే బుధవారం అబూబకర్ సిద్ధికి భార్య సైరాబానును ఎన్ఐఏ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. పీటీ వారెంట్ పై వారం రోజులు పాటు సైరా భానును కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. దీని కోసం సైరా బానును ఎన్ఐఏ అధికారులు విజయవాడకు తీసుకెళ్లారు.

# పత్రికా కార్యాలయాలపై దాడులు దారుణం

## : అల్లం నారాయణ




హైదరాబాద్**అక్టోబర్22ప్రజావినికిడి:**
రాష్ట్రంలో ఎప్పుడూ లేనంతగా వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయంపైకి అధికార పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలు వెళ్లి దాడికి ప్రయత్నించారని, అడ్డుకున్న సిబ్బందిని దుర్భాషలాడారని, తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వార్తల విషయంలో బేధాభిప్రాయాలు ఉన్నప్పుడు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం ఎంత మాత్రం సమంజసం కాదని, బావ ప్రకటన స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించదాన్ని వారు తప్పుపట్టారు. దాడికి పరోక్షంగా కారకులైన వారితోపాటు ప్రత్యక్షంగా పాల్గొన్న వారు ఎంతటి వారైనా వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకమైన దాడులకు పూనుకుంటే జర్నలిస్టు సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రజలకు వాస్తవాలను వివరిస్తాయని చెప్పారు.

# తుని గురుకుల పాఠశాలలో దారుణం

అమరావతి, **అక్టోబర్22ప్రజావినికిడి:)** బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తుని బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణరావు అనే వ్యక్తి.. తరచూ గురుకుల పాఠశాలకు వెళ్లి బాలిక బంధువును అని చెప్పి ఆమెను తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. కూడా గురుకుల పాఠశాలకు వచ్చిన నారాయణ... బాలికను ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు నిందితుడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# ఒలింపిక్ హీరో నీరజ్ చోప్రాకు సైన్యంలో
# లెఫ్టినెంట్ కల్నల్ హోదా

భారత జావెలిన్ సంచలనం, రెండుసార్లు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా ఖాతాలో మరో అరుదైన గౌరవం చేరింది. ఆయనకు భారత ప్రాదేశిక సైన్యంలో (టెరిటోరియల్ ఆర్మీ) గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ లాంఛనాన్ని పూర్తి చేసి, నీరజ్ భుజంపై గౌరవ చిహ్నాలను అలంకరించారు.

ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. నీరజ్ చోప్రా పట్టుదల, దేశభక్తి, నిబద్ధతకు నిలువుటద్దం వంటి వారని కొనియాడారు. క్రీడారంగంలో ఆయన సాధించిన అద్భుత విజయాలు దేశానికి గర్వకారణమని, ఆయన క్రీడాకారులకు, సైనిక దళాలకు ఒకేలా స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఇతర ఉన్నతాధికారులు, నీరజ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

నీరజ్ చోప్రా 2016 ఆగస్టు 26న రాజ్‌పుతానా రైఫిల్స్‌లో నాయబ్ సుబేదార్‌గా భారత సైన్యంలో చేరారు. అప్పటి నుంచి క్రీడల్లో రాణిస్తూనే దేశానికి సేవ చేస్తున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన ఆయన, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలుచుకున్నారు. ప్రపంచ



అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఆయన స్వర్ణ పతకాలు సాధించారు.దేశానికి ఆయన అందించిన సేవలు, క్రీడల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా.. నీరజ్ చోప్రాకు ఈ గౌరవ హోదాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఏడాది ఏప్రిల్ 16నే ఆమోదించారు. దీనికి సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. నీరజ్ చోప్రా ఇప్పటికే పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డులతో పాటు పరమ విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం వంటి సైనిక పురస్కారాలను కూడా అందుకున్నారు.




# కఠిన సవాల్

నవీ ముంబై: ప్రపంచ కప్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. .ఈ మ్యాచ్ గెలిస్తే మన మహిళలకు సెమీఫైనల్ అవకాశాలు సులువు అవుతాయి. ఒక వేళ ఓడితే సమీకరణాలపై ఆధారపడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ టాప్-3లో నిలిచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీపడుతున్నాయి. ఇప్పుడు ఇరుజట్లకు చెరి రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకదాంట్లో ఇద్దరూ ముఖాముఖికి సిద్ధమవడంతో తాజా పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, భారత్ తన తర్వాతి, ఆఖరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించినా సెమీస్ చేరుతుంది. మరోవైపు సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ జట్టు తమ చివరి పోరులో ఇంగ్లండ్‌ను ఓడించాల్సి ఉంటుంది. సోఫీతో పాటు సుజీ బేట్స్‌లాంటి స్టార్ బ్యాటర్లున్న ఆ జట్టు ఇప్పుడు భారత్ పోరుతో తమ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటోంది. గత మూడు మ్యాచుల్లోనూ హర్మన్ సేన గెలుపు ముంగిట బోల్తా పడడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆఖర్లో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా ఓటమిపాలైంది. అయితే స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్ మెరుగ్గానే రాణిస్తున్నారు. కానీ.. ప్రతీకా రావల్, హర్లీన్ రాణించాలి. బౌలర్లలో క్రాంతి గౌడ, శ్రీచరణి, దీప్తి, స్నేహ్ రాణా ఫర్వాలేదనిపిస్తున్నారు. అయితే, గతమ్యాచ్‌లో అదనపు బౌలర్ కోసమని బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసి రేణుకా సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ, రేణుక అంతగా ప్రభావం చూపలేకపోయింది. మరి, కివీస్‌తో పోరుకు ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తారా? లేదంటే ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాకు అవకాశమిస్తారో.. చూడాలి.




# శాఫ్ క్రీడలకు వెంకట్రామ్ మోహిత్

దక్షిణాసియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ (శాఫ్) పోటీల్లో తెలుగు క్రీడాకారులు వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు), మోహిత్ చౌధురి (నాగర్‌కర్నూల్) భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. గురువారం నుంచి రాంచీలో మూడ్రోజులపాటు జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ దేశాలు పోటీ పడనున్నాయి. పురుషుల 800 మీటర్ల పరుగులో వెంకట్రామ్, 5 వేల మీటర్ల పరుగు పోటీకి మోహిత్ అర్హత సాధించారు. ఇక, బహ్రెయిన్‌లో బుధవారం నుంచి జరిగే ఆసియా యూత్ గేమ్స్‌లో యశ్విత (శ్రీకాకుళం) హైజంపలో భారత్ తరఫున పోటీ పడనుంది

# బుమ్రా టాప్..

## టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానం పదిలం

**వన్డేల్లోకి సిరాజ్ రీఎంట్రీ**

**రెండో స్థానానికి ఎగబాకిన పాక్ బౌలర్ నోమాన్ అలీ**

**బుమ్రా, నోమాన్ మధ్య 29 పాయింట్లకు తగ్గిన వ్యత్యాసం**

**వన్డే ర్యాంకుల్లోకి ఘనంగా పునరాగమనం చేసిన సిరాజ్**

**17వ స్థానంలో నిలిచిన భారత పేసర్ మహమ్మద్ సిరాజ్**






ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే, అతడికి పాకిస్థాన్ బౌలర్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. పాక్ స్పిన్నర్ నోమాన్ అలీ అద్భుత ప్రదర్శనతో రెండో స్థానానికి దూసుకురావడంతో బుమ్రా ఆధిక్యం కేవలం 29 పాయింట్లకు పడిపోయింది.దక్షిణాఫ్రికాతో లాహోర్‌లో జరిగిన టెస్టులో నోమాన్ అలీ 10 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో అతను ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి 853 రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లోనే అత్యుత్తమ రెండో ర్యాంకును అందుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో రాణించిన మరో పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 19వ ర్యాంకులో నిలిచాడు. టెస్ట్ బ్యాటింగ్ చార్టులో మాత్రం ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు.

వన్డే ర్యాంకుల్లోకి సిరాజ్

మరోవైపు భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లోకి ఘనంగా పునరాగమనం చేశాడు. ఏడాది తర్వాత వన్డే ఆడిన సిరాజ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మంచి ప్రదర్శన కనబరిచి నేరుగా 17వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన మిచెల్ మార్ష్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానానికి చేరాడు. ఆసీస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్ 10వ, మిచెల్ స్టార్క్ 21వ ర్యాంకు సాధించారు.

# వర్షం అంతరాయాలే కారణం

## సీనియర్ల వైఫల్యంపై స్పందించిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ విఫలం కావడంపై తీవ్ర చర్చ నడుస్తోంది. చాలా కాలం తర్వాత వన్డే జట్టులోకి వచ్చిన వారిద్దరి సన్నద్ధతపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్న తరుణంలో భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందించాడు. వారి వైఫల్యానికి ప్రాక్టీస్ లేకపోవడం కారణం కాదని, ప్రతికూల వాతావరణమే వారి ఆటను దెబ్బతీసిందని స్పష్టం చేశాడు.బుధవారం మీడియాతో మాట్లాడిన కోటక్, మ్యాచ్‌కు పదేపదే వర్షం అడ్డుపడటంతో బ్యాటర్ల ఏకాగ్రత దెబ్బతిన్నదని తెలిపాడు. "రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఎంతో అనుభవజ్ఞులు. తొలి వన్డేలో వారి ప్రదర్శనపై వాతావరణం తీవ్ర ప్రభావం చూపింది. ప్రతి రెండు ఓవర్లకు ఒకసారి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి మళ్లీ మైదానంలోకి రావడం ఏ బ్యాట్స్‌మెన్‌కైనా చాలా కష్టం. అదే సమయంలో ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి ఉన్నా, వాళ్లు కూడా ఇలాగే ఇబ్బంది పడేవారు" అని ఆయన వివరించాడు.

ఆటగాళ్ల సన్నద్ధతపై వస్తున్న విమర్శలను కోటక్ తోసిపుచ్చాడు. "ఆస్ట్రేలియా పర్యటనకు రాకముందే వారిద్దరూ సరైన శిక్షణ తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైరైనా, వారు ఐపీఎల్‌లో నిరంతరం ఆడుతూనే ఉన్నారు. వారి ఫిట్‌నెస్, ప్రాక్టీస్ గురించి మాకు పూర్తి అవగాహన ఉంది. వారు జాతీయ క్రికెట్ అకాడమీలో కూడా శిక్షణ పొందుతారు. అంత సీనియర్ ఆటగాళ్ల విషయంలో అనవసరంగా జోక్యం చేసుకోవడం సరైంది కాదు. వారిని ఒక మ్యాచ్ ఆధారంగా అంచనా




వేయడం తొందరపాటు అవుతుంది" అని కోటక్ అభిప్రాయపడ్డాడు.


ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసిన రోహిత్, కోహ్లీకి ఆస్ట్రేలియాతో తొలి వన్డే కలిసిరాలేదు. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ 8 పరుగులకే ఔట్ కాగా, మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీ డకౌట్ అయ్యాడు. ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో కోహ్లీ డకౌట్ కావడం ఇదే తొలిసారి. వర్షం కారణంగా 26 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.

# మెక్సికోలో ఫుట్‌బాల్ జాతర..

## ప్రాణభయంతో సంపన్న పర్యాటకులు!

2026 ఫీఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అమెరికా, కెనడాతో కలిసి మెక్సికో ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఈ మెగా టోర్నమెంట్ కోసం ఫుట్‌బాల్ అభిమానులు సిద్ధమవుతుంటే, మెక్సికోలోని భద్రతా సంస్థలు మాత్రం సంపన్న పర్యాటకులకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, సాయుధ రక్షణ సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. దేశంలో పేట్రేగిపోతున్న డ్రగ్ మాఫియా, నేరాల కారణంగా ఈ ప్రత్యేక సేవలకు భారీ డిమాండ్ ఏర్పడింది.మెక్సికోలో ఏటా సుమారు 30,000 హత్యలు జరుగుతుండటంతో పర్యాటకులు, ముఖ్యంగా డబ్బున్నవారు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ భయాన్ని అవకాశంగా మలుచుకున్న సెక్యూరిటీ సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. కేవలం బుల్లెట్‌ప్రూఫ్ కార్లే కాకుండా, బాంబుల నుంచి రక్షణ, సాయుధ అంగరక్షకులు, బుల్లెట్‌ప్రూఫ్ దుస్తులు వంటి సేవలను కూడా అందిస్తున్నాయి."మా దగ్గర డబ్బున్న పర్యాటకుల నుంచే బుకింగ్స్ వస్తున్నాయి. మెక్సికో గురించి చెడుగా వినడంతో వాళ్లు భయపడుతున్నారు" అని రుహే అనే సెక్యూరిటీ సంస్థ అధిపతి లియోపోల్డో సెర్డీరా తెలిపారు. వరల్డ్ కప్ కోసం ఆయన తన సంస్థలోని 70 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల సంఖ్యను 80కి పెంచాలని యోచిస్తున్నారు.

మెక్సికో సిటీ, మాంటెర్రీ, గ్వాడలజారా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. వీటిలో గ్వాడలజారా నగరం అత్యంత ప్రమాదకరమైన 'జలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్' (సీజేఎన్‌జీ)కు అడ్డాగా ఉంది. ఈ ముఠాను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించి, దాని నాయకుడిపై 12 మిలియన్ డాలర్ల రివార్డు కూడా




ప్రకటించింది. దీంతో అధికారులు ఆ నగరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రాజధానిలో 40,000 అదనపు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, మ్యాచ్‌లు జరిగే నగరాల్లో డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు విధించారు.

ఈ సెక్యూరిటీ వాహనాలకు రోజుకు 800 నుంచి 1,100 డాలర్ల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. డ్రైవర్, అంగరక్షకుల సేవలకు అదనపు ఛార్జీలు ఉంటాయి. మరోవైపు, డ్రగ్ మాఫియాలు కూడా 'మాన్‌స్టర్స్'గా పిలిచే సొంత బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను తయారు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా, అధిక జీతాలు ఆశ చూపి సెక్యూరిటీ సంస్థల్లోని సిబ్బందినే తమ ముఠాల్లోకి చేర్చుకోవడం ఆందోళన కలిగిస్తోంది.అయితే, ఈ డ్రగ్ ముఠాలు వరల్డ్ కప్‌కు నేరుగా ఎలాంటి ముప్పు కలిగించకపోవచ్చని భద్రతా సలహాదారు డేవిడ్ సౌసెడో అభిప్రాయపడ్డారు. '


ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మోస్ట్ వాంటెడ్ సైనికుడు..

## ఆసక్తికరంగా ప్రభాస్ కొత్త సినిమా పోస్టర్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన అభిమానులకు పుట్టినరోజు కానుక ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం టైటిల్‌ను రేపు ప్రకటించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేసి అంచనాలను పెంచింది. ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రంతో బిజీగా ఉన్న ప్రభాస్, ఆ తర్వాత 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి విడుదల చేసిన పోస్టర్‌లో సైనికుడి దుస్తుల్లో ఉన్న ప్రభాస్ కాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. 'ఒక సైనికుడు ఒంటరిగా కవాతు చేస్తాడు' (%కూ వాశీశ్రీ ఱఅవతీ మ్ఖితీఎ్ట్రవం చూశ్రీశీఅవ%), '1932 నుంచి మోస్ట్ వాంటెడ్' (%వీశీర్ ఔ్ఖత్వస వాఱఅఎ్వవ% 1932) వంటి క్యాప్షన్లు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతున్నాయి. ఈ సినిమా టైటిల్‌ను ప్రభాస్ పుట్టినరోజైన





అక్టోబర్ 23న ఉదయం 11:07 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సినిమా రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక పీరియాడిక్ ప్రేమకథగా ప్రచారం జరుగుతోంది. అయితే, తాజా పోస్టర్‌లోని క్యాప్షన్లను బట్టి ఇందులో స్పై థ్రిల్లర్ అంశాలు కూడా ఉండొచ్చని అభిమానులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రభాస్ పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కొత్త నటి ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం.

'సీతారామం' వంటి క్లాసిక్ ప్రేమకథతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హను రాఘవపూడి, ప్రభాస్‌తో సినిమా చేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# 'డ్యూడ్'కు ఇళయరాజా షాక్..

## మరోసారి లీగల్ చిక్కుల్లో మైత్రీ!




ఒకవైపు కలెక్షన్ల వర్షం, మరోవైపు కాపీరైట్ వివాదం.. ప్రస్తుతం టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ పరిస్థితి ఇది. వారు నిర్మించిన లేటెస్ట్ చిత్రం 'డ్యూడ్', దీపావళి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 90 కోట్లకు పైగా గ్రాస్‌తో వంద కోట్ల క్లబ్ వైపు పరుగులు తీస్తున్న ఈ సినిమాకు, ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. లెజెండరీ మ్యూజిక్ కంపోజర్ ఇళయరాజా, 'డ్యూడ్' సినిమా మేకర్స్‌పై అధికారికంగా ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా, తన పాపులర్ సాంగ్ "కరుత మచ్చాన్"ను సినిమాలో ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ వార్త ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న టైమ్‌లో ఈ వివాదం తెరపైకి రావడం గమనార్హం. నిజానికి, మైత్రీ మూవీ మేకర్స్‌కు, ఇళయరాజాకు మధ్య ఇలాంటి వివాదం తలెత్తడం ఇది మొదటిసారి కాదు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే, అజిత్ హీరోగా వారు నిర్మించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా విషయంలో ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. ఆ సినిమాలో తన అనుమతి లేకుండా మూడు పాటలను ("ఒత్త రూబా తారెన్", "ఇళమై ఇదో ఇదో", "ఎన్ జోడి మంజ కురువి") వాడటమే కాకుండా, వాటిని మార్చారని ఆయన ఆరోపించారు. కాపీరైట్ ఉల్లంఘన కింద 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, పాటలను సినిమా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ, తాము ఆ పాటల హక్కులను సోనీ మ్యూజిక్ వంటి సంస్థల నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేశామని, ఒక్కో పాటకు ?15-20 లక్షలు చెల్లించామని వివరణ ఇచ్చింది. అన్ని నిబంధనలను పాటించామని వారు తెలిపారు. ఈ కేసు ఇంకా కోర్టులో నడుస్తుండగానే, ఇప్పుడు 'డ్యూడ్' విషయంలో మరోసారి అదే తరహా వివాదం మొదలైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కేసు ఇంకా తేలకముందే, 'డ్యూడ్' సినిమాలో తన పాటను అనుమతి లేకుండా వాడటంపై ఇళయరాజా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తాజా ఫిర్యాదుపై మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# రిస్క్ చేయాలని డిసైడైన జాన్వీ కపూర్

ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగి పోలేదు. యాక్షన్ సినిమాకు ఓకే చెప్పిన జాన్వీ ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్ లో పెట్టి అందరికీ షాకిచ్చింది. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం. రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు. రెండు ఫ్లాపుల తర్వాత జాన్వీ ఇలాంటి అడుగు వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఇలాంటి సినిమాలు ఎంచుకుని, ఫ్లాపులు తన కెరీర్ ను డిసైడ్ చేయలేవని జాన్వీ నిరూపించుకోవాలని చూస్తుంది. అంతేకాదు, నటిగా కూడా తనను ఛాలెంజ్ చేసే సినిమాలను ఎంచుకోవాలని డిసైడై, అలాంటి క్యారెక్టర్లపైనే జాన్వీ ఫోకస్ చేసి రిస్క్ చేయడానికి కూడా జాన్వీ రెడీ అయిందని బాలీవుడ్ మీడియా వర్గాలంటున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇప్పటివరకు ఉన్న జాన్వీ క్రేజ్ మరో లెవెల్ కు వెళ్లడం ఖాయం. ఎవరైనా వరుస ఫ్లాపులు వచ్చినప్పుడు సేఫ్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుని హిట్ అందుకోవాలని చూస్తారని, కానీ జాన్వీ మాత్రం భిన్నంగా ఆలోచించి తన సత్తా ఏంటో చాటాలని కసిగా ఉందని, ఏ నటికైనా ఇలాంటి లక్షణమే ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు



# నాన్నలాగే కష్టపడి పేరు తెచ్చుకుంటా

## విక్రమ్ తనయుడు ధ్రువ్

తమిళంలో సంచలన విజయం సాధించిన 'బైసన్' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో చిత్ర కథానాయకుడు ధ్రువ్ విక్రమ్ మాట్లాడుతూ సినిమా కోసం తాను పడిన కష్టాన్ని వివరించారు. ఈ పాత్ర కోసం సుమారు మూడేళ్లు కష్టపడ్డానని, కబడ్డీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నానని తెలిపారు. చిత్రీకరణ సమయంలో పలుమార్లు గాయపడినట్లు, ఎడమ చేయి విరగడంతో పాటు మూడు పళ్లు కూడా దెబ్బతిన్నాయని ఆయన చెప్పుకొచ్చారు.

"ఈ సినిమా కోసం హైదరాబాద్ ప్రమోషన్‌కు రావడం ఎంతో సంతోషంగా ఉంది. సినిమా నంబర్ల గురించి కాకుండా ప్రేక్షకుల ప్రేమ సంపాదించడమే నాకు ముఖ్యం. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా మా నాన్న విక్రమ్ స్టార్ అయ్యారు. నేను కూడా ఆయనలాగే కష్టపడి తెలుగు వారి అభిమానాన్ని పొందాలని కోరుకుంటున్నాను" అని ధ్రువ్ అన్నారు. తనకు తెలుగులో డైలాగ్స్ రాసిచ్చింది 'హాయ్ నాన్న' డైరెక్టర్, తన స్నేహితుడు శౌర్య అని ఆయన తెలిపారు.

కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో పనిచేయాలన్న తన కల ఈ చిత్రంతో నెరవేరిందని చెప్పారు. "మారి సెల్వరాజ్ మొదటి సినిమా చూసినప్పటి నుంచే ఆయనతో పనిచేయాలని ఉండేది. ఈ సినిమా ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ధ్రువ్ డెడికేషన్ చూసి నిజంగా ఆశ్చర్యపోయాను. తమిళంలో వచ్చిన అద్భుతమైన స్పందన తెలుగులో కూడా వస్తుందని నమ్ముతున్నాను" అని ఆమె అన్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, నీలం స్టూడియోస్ పతాకాలపై పా. రంజిత్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రానికి మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. అర్జున అవార్డు గ్రహీత, కబడ్డీ క్రీడాకారుడు మణతి గణేశన్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. క్రీడా స్ఫూర్తితో పాటు సామాజిక అంశాలను స్పృశిస్తూ రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న జగదంబే ఫిల్మ్స్ బ్యానర్‌పై తెలుగులో విడుదల కానుంది.



# వరప్రసాద్ సెట్ లో పెళ్లి కాని ప్రసాద్..!

అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో వస్తున్న సినిమా మన శంకర వర ప్రసాద్. ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాకు భీంస్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పటికే మన శంకర వరప్రసాద్ గారు నుంచి వచ్చిన టీజర్ తో పాటు మీసాల పిల్ల సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమాలో చిరంజీవిని వింటేజ్ కామెడీ టైమింగ్ తో చూపించే ప్రయత్నం చేస్తున్నాడట అనిల్ రావిపూడి. ఐతే మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్ క్యామియో కూడా ఉంటుందని తెలుస్తుంది. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్ లో 3 సూపర్ హిట్ సినిమాలు.. సినిమాలో వెంకటేష్ రోల్ ఏంటన్నది తెలియదు కానీ చిరంజీవి, వెంకటేష్ ఇద్దరు స్క్రీన్ మీద అలా మెరిసే సీన్స్ అన్నీ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయట. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్ లో 3 సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. వెంకటేష్ సెంటిమెంట్ ని చిరంజీవి సినిమాకు వాడేస్తున్నాడు అనిల్ రావిపూడి. మన శంకర వర ప్రసాద్ సినిమా షూటింగ్ లో సోమవారం నుంచి వెంకటేష్ పాల్గొన్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613